

# పసిడిమనసులు - షర్మిల



## ఆకాశమంత

మా ఊళ్లో వేసంకాలం సెలవలొస్తే అందరిళ్లూ పిల్లలతో కిటకిటలాడతయ్యి. మా ఊరి మహిమేంటో ఆడపిల్లల పిల్లలు అమ్మమ్మగారిళ్ల దగ్గరే పెరుగుతారు.

కానీ మొగపిల్లల పిల్లలు తాత నాయనమ్మలని వదిలి వాళ్ల అమ్మమ్మల ఇళ్లకి ఎళ్లరు.

మేం ఆడింది ఆట ...పాడింది పాట!

మా వూళ్లో తాత ముత్తవలు గారాం ఎక్కువయ్యో ఏంటో ! పిల్లలకు బార్లపూడి వదలరు.

గారాలు పెట్టి పాడు చేస్తారని మా ఊరి తాతనాయనమ్మలకి చెడ్డపేరు.

ఇక మా నాయనమ్మ సంగతి చెప్పక్కర్లా. తనకేగాగ మనవళ్లున్నారనుకుంటందో ఏమో. అడుగేస్తే అరిగిపోతారన్నట్టు చూస్తంది.

వేసంకాలం సెలవల్లో జూన్ మొదటివారంలో మా ఊరి లైబ్రరీ యానివర్సరీ జరుగుతుంది. ఆ యానివర్సరీ కోసం పెళ్లయి పొరుగూళ్లల్లో వున్న మా ఊరి ఆడపిల్లలు , వాళ్లపిల్లలు కూడా వస్తారు.

నరసింహారావు పెద్దనాన్న లేకపోతే జయభారతి గ్రంధాలయం లేదు. ఆయన వెనకాల పడి మా నాన్న తరం కుర్రాళ్లుగా వున్నప్పుడు కూలి పనులు చేసి , పెళ్లిళ్లల్లో వడ్డనలు చేసి జయభారతి గ్రంధాలయం పెట్టారు. మా వూరి గుడిలో వున్న ఒక గదిలో లైబ్రరీ వుంటంది. లైబ్రరీ యానివర్సరీ అంటే మాకు పండగే . పిల్లలం నాటకాలేస్తాం. పెద్దాళ్లు ఎవరో పేరున్న వాళ్లని తీసుకొచ్చి సన్మానాలు చేస్తారు.

ఇదిగో ఈ ఏడు మేం అంతా నాటకం ఏద్దామని అనుకున్నాం. తీరా ఏ నాటకం పుస్తకం చూసినా అన్నీ స్త్రీ పాత్ర లేని నాటకం అని అట్టపైన రాసుండేది. నేను ఒక్కదాన్నే ఆడపిల్లని మిగతా అందరూ మొగపిల్లలు. చివరికి మా అత్తయ్య కొడుకు ఒక పుస్తకం సంపాదించాడు.

ఆ నాటకం పేరు " ఈ పిల్లకి పెళ్లి కాదు " అందులో వున్న ఒకే ఒక ఆడ పాత్ర నేను, మా నాన్నగా మా అత్తయ్య కొడుకు, మిగతా రెండు పాత్రలు మా నానీ అన్నయ్య , ఇంకో అత్తయ్య కొడుకు వేద్దామని అనుకున్నాం.

రిహార్సల్ మా ఇంటి వసారాలో చేస్తా వుంటే మా చిట్టెమ్మ మా కోసం తింటానికి ఎయ్యో ఒకటి పెడతా వుండేది. యానివర్సరీ ఇంకో మూడు రోజుల్లోకి వచ్చేసింది. పాటి మీద అంతా బాగు చేయిస్తన్నారు. స్టేజీ కట్టటానికి కావాల్సిన బల్లలు మా బోర్డీస్కూల్ నుంచి తెచ్చి పెట్టుకున్నాం. అసలే వానాకాలం వాన పడకూడదని దణ్ణాలు పెట్టుకున్నాం.

ఆ వాళ్ల మన్నాన్న పాటిమీద అరుగులమీద కూర్చున్నాడు. మేం రంగు కాయితాల్ని కత్తిరించి పురికొసలకి ఉడికించిన మైదాపిండితో అతికిస్తన్నాం. నేను మన్నాన్న దగ్గరికెళ్లి ఆయన్ని ఆనుకుని కూర్చున్నాను.

మా మన్నాన నాకు ఏడెనిమిదేళ్లు వచ్చేవరకూ నన్ను ఎత్తుకుని మోసేవాడు.ఇప్పుడు ఎత్తుకోలేదు కాబట్టి మానేశాడు .

" ఏంటి నాన్నా అట్టా వుండావు !" అన్నాను .

ఆకాశం వంక చూస్తా " ఏంలేదమ్మా ! ఆకు మళ్లు ఎండిపోతన్నయి . ఒక్క వాన పడితే " ... అన్నాడో లేదో నేను" నాన్నా ! అని ఒక్క కేక పెట్టాను."

"నాన్నా! ఒక పక్క లైబ్రరీ యానివర్సరీ , పైగా నాటకం ఏస్తాంటే ,వాన కురవాలంటావా?" అని ఆయన గుండెల మీద చిన్నగా గుద్దుతూ ఏడుపు మొకం పెట్టాను .

" అదునులో వాన పడకపోతే ఎట్టాగమ్మ?" అన్నాడు.

" ఒక పక్క మేం వాన పడకూడదో అని దణ్ణాలు పెట్టుకుంటాంటే , నువ్వు ఏంటి?" అని అరిశా.

" ఆకాశం వాన కురిపించబాకు"అని చేతులెత్తి దణ్ణం పెట్టా .

మన్నాన మాత్రం ఆ రెండు రోజులూ ఆకాశమెంక వాన కోసం చూస్తానే వుండాడు.వాన పడిందా మొత్తం పాటి మీద బురద బురదే. స్టేజీ ఎదురుగుండా కూర్చునే జనాలకి పరదాలెయ్యడానికి కుదరదని నా గోల.

మొత్తానికి యానివర్సరీ రోజొచ్చేసింది.

ముందుగా వచ్చిన గెస్ట్ లకి మా చిట్టెమ్మ పూయించిన గులాబీలు, నూరువరహాలతో కట్టిన పూల గుత్తి ఇచ్చి చామంతిపూల దండలు ఊళ్లో పెద్దాళ్లతో ఇప్పించారు.

అప్పట్లో మా అమ్మానాన్నా చిన్నప్పుడు యానివర్సరీకి నాటకం ఏశారంట. ఇప్పుడు నేను ఎయ్యడం ఆనందంగా వుందని నరసింహారావు పెద్దనాన్న ఉపన్యాసంలో చెప్పాడు.

ఈసారి సెలవలకి వైజాగ్ నుంచి నేనే వచ్చాను. అమ్మా నాన్న రాలేదు . ఆళ్లుకూడా నా నాటకం చూస్తే బాగుండేదనిపించింది.

మన్నాన్న అరుగుల మీద కూర్చునే నా నాటకం చూశాడు.

నాటకం అయిపోయినాకా " నాన్నా ! ఎట్టా వుంది?" అని అడిగాను.

మా మన్నాన్న అసలే ఎప్పుడూ భానుమతి , సావిత్రి అంటాడేమో నా నటన ఏం నచ్చుతుంది.

" నీ బొంద నటన అంటే మహా సముద్రం . డైలాగులన్నీ అప్పజెప్పారు అంతే " అని చప్పరించేసాడు.

" అర్ధరాత్రైయ్యింది ఇక ఇంటికెల్లి పొడుకోమ్మా" అని నన్ను ఇంటి దాకా పంపించి వాళ్ల ఇంటికి ఎళ్లిపోయాడు.

ఆ రాత్రి పడుకుని తెల్లారి లేచేటప్పుడికి వాన కురుస్తాంది. మన్నాన్న తుండు నెత్తి మీద కప్పుకుని ఇంటికొచ్చాడు.

" నాన్నా !వాన కురుస్తాందిగా నీ ఆశ తీరిందా!? " అన్నాను తనని వాటేసుకుని.

" దణ్ణాలు పెట్టావుగా, ఆకాశం నీ మాటా ఇంది , నా గోలా ఇనిపించుకుందిలే " అని నా తల నిమరతా అన్నాడు.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments